క్లుప్తంగా

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కేతేపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన రూ.45,05,220 విలువ గల చెక్కులను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎస్.మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరుకానున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

28న మున్సిపల్ సమావేశం

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈ నెల 28వ తేదీన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రామానుజన్ సేవలు ఎనలేనివి


గణిత ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నల్లగొండ: గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు ఎనలేనివని స్రవంతి స్కూల్ కరస్పాండెంట్ వారణాసి రజనీకాంత్ శర్మ అన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో గణిత శాస్త్రంపై విద్యార్థులు రూపొందించిన గణిత ప్రాజెక్టులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని గణితంపై పట్టు సాధించాలన్నారు. అనంతరం ప్రాజెక్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న తహసీల్దార్ పద్మ

కనగల్: మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను తహసీల్దార్ పద్మ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో దర్వేశిపురం ఆలయ మాజీ చైర్మన్ దేప కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పార్వతమ్మ, జూనియర్ అసిస్టెంట్ లతీఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకూరి సైదులుగౌడ్, పిల్లుట్ల శివరాం, వడ్డెగోని అంజయ్య, రాయల శేఖర్, జినుకుంట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన మునుగోటి మారయ్య అనే నిరుపేద అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ తాటికొండ సంతోష సైదులు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, ముత్తయ్య, అయోధ్య, ముస్తఫా, ప్రసాద్, నగేష్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

నాంపల్లి : జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఈ నెల 30న నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. నాంపల్లిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రాగిఫణి అంజచారి, మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శులు రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

కనగల్ : మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు సంబంధించిన గర్భకోశ నివారణ వ్యాధులు, నట్టల నివారణ మందులు, బలం మందులను పాడి రైతులకు పశువైద్యాధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్డీఏ ఈఓ డాక్టర్ రాజశేఖర్, మండల పశు వైద్యాధికారి సీహెచ్.బాబు, దామెర ప్రసాద్, గోపాలమిత్రలు సురేష్, జగత్, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులో మద్యం పట్టివేత

మర్రిగూడ : బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సోమవారం మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామంలో జరిగింది. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సరంపేటకు చెందిన అలంపల్లి నరసింహ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి సుమారు 2.25 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు !


కాశివారిగూడెం రోడ్డు


కాశివారిగూడెం రోడ్డు మార్గంలో నిర్మించిన కల్వర్టు

- తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గంగన్నపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు
- నిర్ణీత గడువులోగా పూర్తికాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తిప్పర్తి : గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం లేక దశాబ్దాల కాలంగా తిప్పర్తి మండలంలోని కాశివారిగూడెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి రోడ్డుపై వర్షాకాలంలో కనీసం వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి ఆపదలో అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎట్టకేలకు ఇటీవల తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గంగన్నపాలెం గ్రామం వరకు రూ.5 కోట్లతో 8.2 కిలోమీటర్లకు బీటీ రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణానికి 17మే 2023న కాంట్రాక్టర్‌కు అగ్రిమెంటు కూడా అయింది. సుమారు 18 నెలల కాలంలో రోడ్డు పూర్తి కావాల్సి ఉండగా నేటివరకు పూర్తి కాలేదు.

నిర్మించాల్సిన కల్వర్టులు 12..

తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గంగన్నపాలెం గ్రామం వరకు మొత్తం 8 కిలోమీటర్ల పరిధిలో 12 కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు ఐదు కల్వర్టులను మాత్రమే పూర్తి చేశారు. ఇంకా ఏడు కల్వర్టులను నిర్మించాల్సి ఉంది. మూడు నెలల క్రితం వరకు కల్వర్టుల నిర్మాణ పనులు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు ద్వారా కాశివారిగూడెం, రాజుపేట, గంగన్నపాలెం, జొన్నగడ్డలగూడెం గ్రామాల ప్రజలు అనునిత్యం తిప్పర్తి మండల కేంద్రానికి రాకపోకలను సాగిస్తుంటారు. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. పనులు వేగవంతం చేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేయాలి



“కాశివారిగూడెం గ్రామానికి రోడ్డు మంజూరు చేశారని తెలిసి చాలా సంతోషించాం. కానీ పనుల్లో జాప్యం చేస్తున్నారు. త్వరగా రోడ్డు పూర్తి చేస్తే మా గ్రామ ప్రజలకు రాకపోకల ఇబ్బంది లేకుండా ఉంటుంది. రోడ్డులేక చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి పనులు వేగవంతం అయ్యేలా చూడాలి.
–సయ్యద్, కాశివారిగూడెం

దశాబ్దాల నుంచి రోడ్డు లేదు



“దశాబ్దాల కాలం నుంచి కాశివారిగూడెం గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి కనీసం ఆపద సమయంలో అంబులెన్స్ వాహనం కూడా రావడం లేదు. ప్రస్తుతం రోడ్డు మంజూరయింది. కానీ నిర్మాణంలో జాప్యం చేస్తున్నారు. పనులు వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
–షేక్ పాషా, కాశివారిగూడెం

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం

“తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గంగన్నపాలెం గ్రామం వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి, కొన్ని కల్వర్టుల నిర్మాణం కూడా జరిగింది. పొలాలు నాట్లు పడుతున్నందున మట్టి సమస్య ఉంది. అయినా రోడ్డు పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
–శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, తిప్పర్తి

ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


కల్యాణ లక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్ మండలానికి చెందిన 83 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ప్రజలకు అందుబాటులో ఉంటూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చే సౌకర్యం కల్పించానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ యశ్వంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, లక్ష్మీవెంకన్న, గర్శకోటి సైదులు, సునీల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్

నల్లగొండ టౌన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముఖ్య కార్యాలయంలో సోమవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి , డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, జయరాంనాయక్, వేమూరి రంగాచారి, పల్ల ప్రవీణ్‌రెడ్డి, మొగిలిపాక రామచంద్రయ్య, బ్యాంక్ సీఈఓ ఆర్.శంకర్‌రావు, నాబార్డ్ డీడీఎంలు వినయ్‌కుమార్, సత్యనారాయణ మైకేల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

మర్రిగూడ : ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీలో మర్రిగూడ మండలంలోని పలువురికి చోటుదక్కింది. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి మంచుకొండ శేఖర్, ఊరె భూతపయ్య, చందా వెంకటేశ్వర్లు, ఊరె వెంకటయ్యలు ఉపాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శిగా గజవెల్లి రవి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎన్నికయ్యారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలను సంఘం అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ అందజేశారు.

నేడు రైతులకు అవగాహన

మర్రిగూడ : వరికొయ్యలు కాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ మల్లేష్ తెలిపారు. రైతులందరూ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



నల్లగొండ: రైతు రాంరెడ్డిని సన్మానిస్తున్న గోనారెడ్డి, ప్రిన్సిపాల్ సుధారాణి

నల్లగొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ టి.సుధారాణి అధ్యక్షతన రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొరగల్ రైతు, పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ చౌదరి చరణ్‌సింగ్ జన్మదినాన్ని రైతు దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ తరఫున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం పల్‌రెడ్డి రాంరెడ్డిని శాలువా, మొక్కలతో సన్మానించారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి రైతు దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులకు సన్మానం

చిట్యాల: పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆదర్శ రైతులు పిశాటి సత్తిరెడ్డి, కన్నబోయిన మహాలింగం, కొనతం సత్తిరెడ్డిలతోపాటు మరికొందరిని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణఅనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్వామి శ్రద్ధానందకు నివాళి


మాట్లాడుతున్న హరికిషన్ వేదాలంకర్

నల్లగొండ: స్వామి శ్రద్ధానంద ఆదర్శప్రాయుడని ఉమ్మడి రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రతినిధి సభ మంత్రి హరికిషన్ వేదాలంకర్ అన్నారు. సోమవారం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ హైస్కూల్‌లో స్వామి శ్రద్ధానంద 98వ బలిదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించి శ్రద్ధానంద స్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి శ్రద్ధానంద దేశంలో మొట్టమొదటిసారిగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో గురుకులాలను స్థాపించారని తెలిపారు. స్వామి దయానంద సరస్వతి ఉపన్యాసానికి ప్రభావితులై సామాజిక సంస్కరణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ అధ్యక్షుడు బోయపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి కార్యవర్గ సభ్యులు కోటయ్య, లక్ష్మీ నర్సు, షాపల్లి రవి ప్రసాద్‌రావు, వేదమిత్ర పాఠశాల కరస్పాండెంట్ నాగేందర్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడ వాసికి అవార్డు


అవార్డు అందుకుంటున్న యాదగిరి

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన డాక్టర్ కంబంపాటి యాదగిరి ప్రజా సంబంధాల రంగంలో చేస్తున్న కృషికిగాను పీఆర్ఎస్ఐ(పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన 46వ పీఆర్ఎస్ఐ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో యాదగిరికి ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్‌సాహు అవార్డును అందజేశారు. యాదగిరి ప్రస్తుతం పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సెక్రటరీగా సేవలందిస్తున్నారు. ఆయన హైదరాబాద్‌లోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జర్నలిజం శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ ఆ శాఖ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మునుగోడు: మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన రావుల రాములుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.40వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కుంభం యాదగిరిరెడ్డి, బొందు రవి, ఇరిగిదిండ్ల భిక్షం, ఎడ్ల యాదయ్య, అబ్బనబోయిన యాదయ్య, రావుల గోపాల్, అందోజు నాగభూషణచారి పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

చండూరు : జిల్లా కేంద్రంలో ఈ నెల 28,29,30 తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని చండూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల భిక్షం పిలుపునిచ్చారు. మహాసభల ప్రచార పోస్టర్లను సోమవారం చండూరులో చామలపల్లి హెచ్‌ఎం పద్మావతి, సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు, కార్యక్రమంలో బొమ్మరబోయిన సైదులు, కత్తుల మమత, గిరి, సతీష్, ఆంజనేయులు, రాములు, సంతోష, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి: జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ సభలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం సంఘం నాయకులు మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న, క్రీడా కన్వీనర్ బి సురేందర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ సీహెచ్ వరలక్ష్మి, పి.వీరాచారి, తిప్పర్తి మండల అధ్యక్షుడు ఎండీ ఖైరుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఆదిమల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

బస్సు జాతా పోస్టర్..

తిప్పర్తి : రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 31వరకు నిర్వహించే బస్సు జాతాను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆశా వర్కర్లు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు మంత్రాల మంగమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పార్వతమ్మ, సైదమ్మ, ఇందిరమ్మ, రేణుక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: నల్లగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దుబ్బాక మల్లమ్మ సోమవారం మృతి చెందారు. మల్లమ్మ కుటుంబ సభ్యుల అనుమతితో నల్లగొండ పట్టణ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ హరనాథ్ కంటి డాక్టర్ పుల్లారావు సోమవారం మృతురాలి నేత్రాలను సేకరించారు.హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్‌కు సేకరించిన నేత్రాలను (కార్నియా) పంపించి, 72 గంటల్లోగా కార్నియా సమస్యతో బాధపడుతున్నవారికి శస్త్ర చికిత్స చేసి కంటిచూపు తెప్పిస్తామని తెలిపారు. నేత్రదానం చేయాలనుకునేవారు 9948143299 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ : ప్రేమ విందులో భాగంగా కేక్ కట్ చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


మునుగోడు : మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


మర్రిగూడ : రాజాపేటతండా చర్చిలో కేక్ కట్ చేస్తున్న అధికారులు

నకిరేకల్ : క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా అధికారికంగా నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నకిరేకల్, కేతేపల్లి మండలాల క్రైస్తవులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడారు. పాస్టర్స్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేముల హనోక్ అయోధ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, గర్శకోటి సైదులు, పాస్టర్లు ప్రేమ్‌దాస్, తీగల జాన్సన్, ఆదిమల్ల సందీప్, దానియేల్, జాషువా, జానయ్య, సుదర్శన్, క్రిష్టఫర్ పాల్గొన్నారు.

పేద క్రైస్తవుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

మునుగోడు: పేద కుటుంబాలకు చెందిన క్రైస్తవుల ఆర్థిక అభివృద్ధికి, వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడులో సోమవారం ప్రభుత్వం తరఫున క్రైస్తవులకు ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వివిధ మతాల పెద్ద పండుగలకు పేదలకు సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఏసుక్రీస్తును స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయ భాస్కర్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ప్రేమ విందు

మర్రిగూడ : క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న క్రిస్మస్ ప్రేమ విందును సోమవారం మండలంలోని రాజాపేటతండాలో అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, డీటీ జూటూరు తారకరామన్, సూపరింటెండెంట్ యాకుబ్, చర్చి ఫాదర్‌లు పాల్గొన్నారు.

అట్టహాసంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


నల్లగొండ టౌన్: సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు


నార్కట్‌పల్లి : వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

నల్లగొండ టౌన్: పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఏసు ప్రార్థన గీతాలను ఆలపించారు. ఎం.కేశవాచారి ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసి క్రీస్తు పాటలను ఆలపించారు. కొవ్వొత్తులు వెలిగించి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.మొజెస్, వై.సమర్పణ్‌కుమార్, బి.ప్రదీప్ సామ్యేల్, ఆర్.పి అబ్రహం, జేడీ పాల్, ఆర్.రాజ్, బి.మాథ్యూస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం ,గౌరవాధ్యక్షుడు ఎస్.రంగయ్య, బి.మోహన్‌రావు, ఎస్. ఆంజనేయులు, ఎం.సంతోష్‌రెడ్డి, ఎండీ. హుస్సేన్, ఎం.వెంకట్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, కత్తుల శంకర్, ఎన్‌డి. మార్తమ్మ, వై.వాసుదేవ్, ఎం. కేశవాచారి, జి.సుధాకర్, టి.రమేష్, ఎం.శేషారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ చేతన స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, నాగలక్ష్మి, వంగాల శిరీష, మనోహర్, మంజుల, కళ్యాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

మునుగోడు: మండల కేంద్రంలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో 2001–03 విద్యా సంవత్సరంలో ఇంటర్ సీఈసీ విద్యనభ్యసించిన విద్యార్థులు సోమవారం మునుగోడులో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, స్వామి, రాము, వెంకటేశ్వర్లు, నర్సింహ, అటెండర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

తిప్పర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ స్వప్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మన్నెం భిక్షం, గణేశ్ మంత్రాల మంగమ్మ, మైల సైదులు, కొట్ల గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, ప్రతాప్‌రెడ్డి, శరత్, వెంకన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ: మూతబడిన స్కౌట్ బిల్డింగ్‌ను తెరిపించాలని కోరుతూ సీనియర్ స్కౌట్ బ్యాండ్ మాస్టర్ ములకల నరహరి సోమవారం గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. స్కౌట్ గైడ్స్ ఇన్‌చార్జ్‌గా ఉన్న కరుణాకర్‌యాదవ్ పదవీకాలం పూర్తయినప్పటికీ ఇంకా పదవిలో కొనసాగుతున్నారని ఫిర్యాదు చేశారు.

నష్ట పరిహారం ఇప్పించాలని..

నల్లగొండ రూరల్: జాతీయ రహదారి 565 నకిరేకల్–నల్లగొండ–సాగర్ రోడ్డు విస్తరణలో నివాసాలు, వ్యవసాయ భూములు కోల్పోయిన 36 మంది బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి నల్లగొండ మండలంలోని చిన్న సూరారం మాజీ సర్పంచ్ నారబోయిన నర్సింహగౌడ్ వినతిపత్రం అందజేశారు. రెండేళ్లు గడిచినా బాధితులకు నష్టపరిహారం అందలేదని, రూ.50 లక్షలకు పైగా నష్టపరిహారం రావాల్సి ఉందన్నారు.

తహసీల్దార్‌కు..

చండూరు : మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో ప్రభుత్వ భూమిలో కొంతమంది అక్రమంగా షెడ్డు (చర్చి నిర్మాణం) నిర్మాణ పనులు చేపట్టారని, ఆ పనులను నిలిపివేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోమటి వీరేశం, పిన్నింటి నరేందర్‌రెడ్డి, భూతరాజు శ్రీహరి, మాదగాని నాగార్జున, పేర్ల గణేశ్, సత్తయ్య, మల్లయ్య, సందీప్ తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం.. ముగ్గురిపై కేసు

నల్లగొండ క్రైం: కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన అంకోజు సతీష్‌కుమార్ ఇంట్లో అతడితో పాటు అంకెనపల్లి ప్రభాకరచారి, సాలోజు హరిప్రసాద్ ఆదివారం రాత్రి విందు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ వివాదం జరగడంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా వెంటనే టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను దూషించారు. పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ లింగస్వామి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో కానిస్టేబుల్ లింగస్వామి సోమవారం టూటౌన్ ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అయితే సతీష్‌కుమార్ ఇంటి సమీపంలో ఉంటున్న ఓ కానిస్టేబుల్‌తో అతడికి కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఆ కానిస్టేబులే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడితోనూ వివాదానికి దిగారు.